


## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి,గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచ్ కమ్మరి స్వప్న నాగరాజు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు ఎండలో పనిచేస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తరచు నీళ్లు తాగాలని తలకు గుడ్డ కట్టుకోవాలని అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చీకటి మధు, కడారి శ్రీనివాస్, పూజ్యం లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ పూజలు లింబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే కొనాలి



**ప్రజానావ, కోనరావుపేట:** రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

## జొన్న రైతుల ధర్నా

**ప్రజానావ, నిర్మల్:** జొన్నలు కొనుగోలు చేయాలని డిమాడ్ చేస్తూ నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మార్కెట్ యార్డు వద్ద స్వర్ణ-నిర్మల్ రహదారిపై మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తహసీల్దార్ కలెక్టర్ భవేశ్‌మిశ్ర దృష్టికి తీసుకువెళ్లి రెండు రోజుల్లో జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సారంగాపూర్ మార్కెట్ యార్డులో జొన్నలు పోసి నెల రోజులు గడుస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 20 రోజుల క్రితం ప్రారంభించారని, అప్పటి ఇప్పటివరకు గన్నీ బ్యాగులు లేక ఒక గింజా కూడా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణంలో మార్పుల వల్ల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండడంతో జొన్నలు తడసి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

## దశల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఐటీడీఏ పీవో మంద మకరంద హామీ

**ప్రజానావ, ఆదిలాబాద్:** దశల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో మంద మకరంద అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం ఖైరదట్వా గ్రామంలో జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరంద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోడ్డులు, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ నాయకులు పీవోను కోరారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలు ఉన్నత చదువులు అభ్యసిస్తేనే ప్రయోజకులుగా ఎదుగుతారన్నారు. పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన అంశాలు సమన్వయంతో చర్చించి తీర్మానం చేయాలని, తీర్మానం ప్రణాళికాబద్ధంగా ఉండాలని, ప్రభుత్వ పథకాలను వందశాతం అమలు చేసిన అధికారులకు బహుమతి ప్రకటిస్తామని తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న సమస్యలు దశలవారీగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనక సత్యనారాయణ,ఉప సర్పంచ్ విశ్వజిత్, అడిషనల్ డీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్, డీఎల్ పీవో ప్రభాకర్, తాహసిల్దార్ జాడి రాజలింగం, ఎంపీడీవో పూల్లారావ్,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజాసేవలో నిబద్ధతతోనే అధికారులకు గుర్తింపు

### హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

### ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు దిశానిర్దేశం

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రజాసేవలో నిబద్ధత, పరిపాలనలో పారదర్శకత, ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపినప్పుడే అధికారులకు మంచి గుర్తింపు లభిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రతి నిర్ణయంలో ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన సూచించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడంతో పాటు ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం పెంచుకున్నప్పుడే వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయని తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చన్నారు. ప్రతి నిర్ణయంలో నిష్పక్షపాత ధోరణి పాటిస్తూ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఉద్యోగాన్ని హోదాగా కాకుండా బాధ్యతగా భావించి సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. "భూముల పరిరక్షణ మరియు ఆక్రమణల తొలగింపు" అంశంపై ఆయన సమగ్ర అవగాహన కల్పించారు. ప్రభుత్వ భూముల సంరక్షణలో రెవెన్యూ అధికారుల పాత్ర, భూ ఆక్రమణల నివారణకు అనుసరించాల్సిన చట్టపరమైన



విధానాలు, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వివరించారు.

### భూ రికార్డుల నిర్వహణలో చొరవ చూపాలి

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భూ రికార్డుల నిర్వహణలో చొరవ చూపాలని సూచించిన ఆయన, అధికార విధుల నిర్వహణలో ప్రత్యేకత కనబరిచి తమకంటూ ప్రత్యేక గుర్తింపు, బ్రాండ్ సృష్టించుకోవాలని అన్నారు. నిజాయతీ, నిబద్ధత, పారదర్శకతతో వ్యవహరిస్తూ విధులకు న్యాయం చేస్తున్నామనే భావన ఒత్తిడిని దూరం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. హైడ్రా కార్యకలాపాలు, ఆక్రమణల తొలగింపు సమయంలో ఎదు-రయ్యే సవాళ్లు, పరిపాలనా ఇబ్బందులపై ఆరాతీశారు. చెరువుల పునరుద్ధరణ, వర్షాకాలంలో వరదల నివారణకు హైడ్రా చేపడుతున్న చర్యలపై కూడా వివరాలు తెలుసుకున్నారు.

# ఉద్యమకారుల సేవలకు గుర్తింపు

### తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్‌రెడ్డి

### ఉద్యమకారుల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మోతే శోభన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నరేందర్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ భేటీలో తెలంగాణ ఉద్యమకారుల సేవలు, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా



చర్చించినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలు, సేవలను ప్రభుత్వ స్థాయిలో గుర్తించి వారికి తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వారు చర్చించినట్లు తెలిసింది. ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలపై కృతజ్ఞతలు తెలియజేసిన మోతే శోభన్‌రెడ్డి, ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నట్లు సమాచారం. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యమకారుల పాత్ర కీలకమని, వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యునిగా మోతే శోభన్‌రెడ్డికి నియామకంపై పలువురు ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి

### సికింద్రాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాం

### 81 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

### సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ వ్యాఖ్య

**ప్రజానావ, సికింద్రాబాద్:** పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా ప్రభుత్వం పై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ మున్సిపల్ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన బుధవారం పంపిణీ చేశారు. సితాఫల్‌మండీలోని టీఆర్‌టీఈ క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మారేడుపల్లి మండలానికి చెందిన 81 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 81 లక్షల విలువైన చెక్కులను పద్మారావు గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని, ప్రతి ఇంటికీ వివిధ సంక్షేమ పథకాలను చేరవేసేందుకు కృషి చేశామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించగలిగామని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు మరింత మేలు చేకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వ యంత్రాంగం మరింత చిత్తశుద్ధితో




పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మారేడుపల్లి తహసీల్దార్ అస్మతుల్లా ఖాన్, మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్‌తో పాటు పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ జెండా పండుగకు శ్రీకారం

### 33 జిల్లాలకు ఇన్‌చార్జీలు, స్టేట్ అబ్జర్వర్ల నియామకం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "జెండా పండుగ" కార్యక్రమానికి పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత శ్రీకారం చుట్టారు. ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న జెండా పండుగ కార్యక్రమం కోసం 33 జిల్లాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు జిల్లా ఇన్‌చార్జీలు, స్టేట్ అబ్జర్వర్లను నియమించారు. జెండా పండుగ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించేందుకు పార్టీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజల్లో పార్టీ భావజాలాన్ని తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రంగు నవీన్ ఆచారి, స్టేట్ అబ్జర్వర్‌గా కరిమిల్ల బాబురావు, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్‌గా ఆదురుగట్ల సంపత్ గౌడ్, స్టేట్ అబ్జర్వర్‌గా కోల శ్రీనివాస్, కరీంనగర్‌కు చందా లక్ష్మీనారాయణ గుప్తా జిల్లా ఇన్‌చార్జ్‌గా, కందాడి మణిపాల్ రెడ్డి స్టేట్ అబ్జర్వర్‌గా, వరంగల్, హన్మకొండ జిల్లాలకు నడిపెల్లి వెంకటేశ్వరరావు జిల్లా ఇన్‌చార్జ్‌గా, సయ్యద్ ఇస్మాయిల్ స్టేట్ అబ్జర్వర్‌గా, హైదరాబాద్ జిల్లాకు భగవతుల సాయి మహేష్ జిల్లా ఇన్‌చార్జ్‌గా, ఎండి అబ్దుల్ సలీమ్ స్టేట్ అబ్జర్వర్‌గా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు రామిడి వెంకట్ రెడ్డి జిల్లా ఇన్‌చార్జ్‌గా, రంగు నవీన్ ఆచారి, కిషోర్ తానింటి స్టేట్ అబ్జర్వర్లుగా, ఇదే తరహాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పార్టీ బాధ్యులను నియమిస్తూ అధికారిక జాబితాను విడుదల చేశారు. జెండా పండుగ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని టీఆర్ఎస్ నాయకత్వం పేర్కొంది.



